క్లుప్తంగా

రహదారి శుభ్రం



ఇసుక, మట్టిని శుభ్రం చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

సుల్తానాబాద్: పట్టణంతో పాటు పలు ప్రాంతాల్లో రాజీవ్ రహదారిపై ఇసుక, మట్టి ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని 'సాక్షి'లో ఇటీవల వార్త ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించడంతో శుక్రవారం పనులు ప్రారంభమయ్యాయి. కాంట్రాక్టు సిబ్బందితో శుభ్రం చేయించే పనిలో ఉన్నారు.

అల్ఫోర్స్ విద్యార్థుల విజ్ఞానయాత్ర



స్టడీ టూర్‌లో విద్యార్థులు

సుల్తానాబాద్: విద్యార్థులకు ప్రతి విషయంపై అవగాహన పెంచేందుకు అల్ఫోర్స్ విద్యాసంస్థలు ఎప్పుడూ ముందుంటున్నాయని విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సుల్తానాబాద్ అల్ఫోర్స్ పాఠశాలలో చదువుతున్న ఎల్‌కేజీ విద్యార్థులకు పాఠ్యాంశంలో భాగంగా సుల్తానాబాద్ రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రైల్వేస్టేషన్లో జరిగే తీరు తెన్నులను అధ్యాపకులు వివరించారు. దూర ప్రాంతాలకు వెళ్లేవారు ఒకేసారి వేల మందిని తరలించే అవకాశం రైలు ద్వారా ఉంటుందన్నారు. వేరే ప్రాంతాలకు సామగ్రిని తరలించేందుకు గూడ్స్ రైలు ఉంటుందని విద్యార్థులకు వివరించారు. స్టేషన్‌లో మేనేజర్, సిబ్బంది చేసే పనుల గురించి విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు ఉన్నారు.

ఇక స్తంభం ఎక్కుడు సులువే



ఇనుప చెప్పులతో స్తంభం ఎక్కుతున్న విద్యుత్ ఉద్యోగి

సుల్తానాబాద్: విద్యుత్ ఉద్యోగులు విద్యుత్ స్తంభం ఎక్కేందుకు కష్టాలు తొలగాయి. స్తంభం ఎక్కాలంటే విద్యుత్ ఉద్యోగులు ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం టెక్నాలజీ పెరగడంతో కాళ్లకు ఇనుపచెప్పులతో స్తంభంకు వేసుకొని ఎక్కేలా అధికారులు విద్యుత్ ఉద్యోగులకు సరఫరా చేశారు. స్తంభం ఎక్కడం సులభంగా ఉందని ఉద్యోగులు చెప్తున్నారు.

నాగ్‌పూర్ ప్యాసింజర్‌ను కొలనూర్‌లో ఆపాలి

ఓదెల: కాజీపేట్ నుంచి అజ్నీ రైల్వేస్టేషన్ల మధ్యలో నడిచే నాగ్‌పూర్ ప్యాసింజర్ రైలును కొలనూర్ రైల్వేస్టేషన్‌లో ఆపాలని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్ రైల్వే ఉన్నతాధికారులను కోరారు. ఓదెలలో ఉర్పాటు చేసిన సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. గతంలో కొలనూర్ ఆగిన నాగ్‌పూర్ ప్యాసింజర్ ఆగకపోడంతో విద్యార్థులు, రైతులు, వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. నాగ్‌పూర్ వరకు నడిచే ఏకైక ప్యాసింజర్ రైలు హాల్టింగ్ లేకపోడంతో సాధారణ ప్రయాణికులకు ఇబ్బందిగ మారింది. రైల్వే ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ప్యాసింజర్ రైలును కొలనూర్‌లో హాల్టింగ్ కల్పించి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ షాక్‌తో మేకపోతు మృతి

రామగిరి: మండలంలోని రత్నాపూర్ గ్రామంలోని మేడిపెల్లి శివారు తెట్టికుంట ప్రాంతంలో శుక్రవారం విద్యుత్ షాక్‌తో మేకపోతు మృతిచెందింది. రాంనగర్‌కు చెందిన మేకల చంద్రయ్య మేకలను మేతకు తీసుకెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గడ్డి మేస్తూ విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందింది. ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ పల్లె ప్రతిమ, ఎంపీటీసీ దర్ముల రాజ సంపత్ కోరారు.

కార్మికులకు కలుషిత నీరే దిక్కు!



ఫిల్టర్ బెడ్‌లో అపరిశుభ్రంగా ఉన్న నీరు



ఫిల్టర్ బెడ్ ఆవరణలో కుక్క కళేబరం

- అపరిశుభ్రంగా ఫిల్టర్ బెడ్‌లు.. కానరాని శుద్ధి చర్యలు
- ఫిల్టర్ బెడ్ ఆవరణలో చనిపోయిన కుక్క
- పట్టించుకోని యాజమాన్యం

రామగిరి: ఆర్జీ–3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీలో నివసిస్తున్న సింగరేణి కార్మికులకు నిత్యం కలుషిత నీరే దిక్కవుతోంది. సింగరేణి కార్మికుల ఆరోగ్యంపై యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని చెప్తున్న అధికారుల మాటలు ఆచరణలో అమలు కావడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సెంటినరీకాలనీలోని కార్మికులు, కార్మిక కుటుంబాలు విష జ్వరాలు, రోగాల బారిన పడుతున్నప్పటికీ పట్టించుకునే వారు కరువయ్యారు. సెంటినరీకాలనీలోని ఫిల్టర్ బెడ్ ద్వారా కార్మికులకు అందించే నీరు పూర్తి అపరిశుభ్రంగా ఉంది. ఫిల్టర్ బెడ్ చుట్టూ కంచె ఏర్పాటు చేయకపోవడంతో ఆ నీటిలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఫిల్టర్ బెడ్ ఆవరణలో ఒక కుక్క మృతి చెందినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు.

రోగాల బారిన కార్మికులు..

సింగరేణి యాజమాన్యం పట్టించుకోకపోవడంతో కార్మికుల సంక్షేమంపై నీలినీడలు కమ్ముకున్నాయి. అలాంటి అపరిశుభ్ర నీటినే సింగరేణి క్వార్టర్లకు సరఫరా చేయడంతో కార్మికులు గత్యంతరం లేక అదే నీటిని వాడుతున్నారు. దీంతో రోగాల బారిన పడి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నామని కార్మికులు వాపోతున్నారు. కలుషిత నీరు, అధికారుల నిర్లక్ష్యంతో కార్మికుల సంక్షేమం అమలులో చిత్తశుద్ధి కనిపించడం లేదు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతపై ఉన్న శ్రద్ధ కార్మికులకు అందించే తాగునీటిపై లేకపోవడం, కార్మికుల అనారోగ్య బారిన పడుతున్నా.. యాజమాన్యం సంక్షేమంపై నిర్లక్ష్యంగా ఉండడంతో కార్మికులు తీవ్ర ఆగ్రహం చెందుతున్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. కార్మికుల సంక్షేమం పట్టించుకోవాల్సిన కార్మిక సంఘాలు కూడా పట్టించుకోవడం లేదని, సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఫిల్టర్ బెడ్‌లను శుభ్రపరిచి పరిశుభ్రమైన నీటిని అందించాలని కార్మికులు, కార్మిక కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

రైతులకు తప్పని సాగునీటి కష్టాలు

- ఎండిపోయిన అట్లకుంట చెరువు
- కాలువల పునరుద్ధరణ మరిచిన అధికారులు
- చివరి ఆయకట్టుకు సాగునీరందని వైనం
- రైతులకు తప్పని యాసంగి కష్టాలు



ఎండిపోయిన అట్లకుంట చెరువు



తూం వద్ద పెరిగిన తుంగ

రామగుండం: మరో కొన్నిరోజుల్లో ప్రారంభం కానున్న యాసంగి సీజన్‌కు సాగునీరందే పరిస్థితి లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అంతర్గాం మండల పరిధిలోని విసంపేట గ్రామ పరిధిలో ఉన్న అట్లకుంట చెరువు పూర్తిగా ఎండిపోవడంతో సమీపంలోని బావుల్లో నీరు అడుగంటిపోయింది. ఫలితంగా మోటార్లతో తడుపుకునే పరిస్థితి కూడా లేకుండా పోయిందని వాపోతున్నారు. ఎస్సారెస్పీ కాలువకు చివరి ఆయకట్టు గ్రామమైన విసంపేట రైతులు సాగునీరందక ప్రతీ సీజన్‌లో పంటసాగుకు తిప్పలు పడుతున్నారు. ఎస్సారెస్పీ అధికారులు కనీసం కాలువల మరమ్మతు చేపట్టలేదు. దీంతో చివరి ఆయకట్టుకు సాగునీరందడం లేదంటూ పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా.. వారి నుంచి ఎలాంటి స్పందన కానరావడం లేదని వాపోతున్నారు. తలాపున ఎల్లంపల్లి ప్రాజెక్టు ఉన్నప్పటికీ బ్రాహ్మణపల్లి వద్ద ఐదేళ్లయినా ఎత్తిపోతల పనులు పూర్తికాకపోవడం రైతులకు శాపంగా మారింది.

ఎండిపోయిన అట్లకుంట..

విసంపేట గ్రామ శివారులో ఉన్న అట్లకుంట చెరువు పూర్తిగా ఎండిపోవడంతో పాటు పంట పొలాలకు సాగునీరు పారే తూము వద్ద పూర్తిగా తుంగతో నిండిపోవడంతో సాగునీటి సరఫరాకు అడ్డంకిగా మారింది. అట్లకుంట చెరువును నీటితో నింపితే సుమారు వెయ్యి ఎకరాలకు సాగునీటి అవసరాలు తీరనున్నాయని రైతులు అంటున్నారు. బ్రాహ్మణపల్లి ఎత్తిపోతలు ప్రారంభమైతే డీ–83 నుంచి 27/ఎల్ మీదుగా సరఫరా అయ్యే నీరు 8ఎల్ కాలువ ద్వారా విసంపేట, మద్దిర్యాలకు అందనుంది. కాగా సత్వరమే శిథిలావస్థకు చేరిన ఎస్సారెస్పీ కాలువలను పునరుద్ధరించి కాలువల్లో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, తుంగను తొలగించి చివరి ఆయకట్టుకు సాగునీరందేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



మా గ్రామ శివారులో ఉన్న అట్లకుంట చెరువును ఎస్సారెస్పీ నీటితో నింపితే కనీసం రైతుల అవసరాలు తీరుతాయి. సుమారు వెయ్యి ఎకరాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా సాగు అవసరాలకు నీరందుతుంది. దీనిపై అధికారులు స్పందించి రైతుల కష్టాలు తీర్చాలి.

– బర్పటి సురేశ్, రైతు, విసంపేట,

పునరుద్ధరణ మరిచారు



కొన్నేళ్లుగా ఎస్సారెస్పీ అధికారులు శిథిలావస్థకు చేరిన కాలువల పునరుద్ధరణ పనులు చేపట్టడం మరిచారు. అధికారులపై ప్రజాప్రతినిధులు ఒత్తిడి చేసినప్పటికీ అప్పటికప్పుడు పనులు చేపడతామని హామీలే తప్పా.. ఆచరణలో మాత్రం కానరావడం లేదు. తలాపున ఎల్లంపల్లి ప్రాజెక్టు ఉన్నా సాగునీటి కష్టాలు మాత్రం తప్పడం లేదు.

– తిరుపతి, రైతు, విసంపేట

మైకుల గోల లేదు.. ఓటు అడిగేవారు లేరు

- ఎన్నికలు ముగియడంతో ప్రశాంతంగా పల్లెలు
- వ్యవసాయ పనుల్లో బిజీ అయిన రైతులు, కూలీలు



నిర్మానుష్యంగా జూలపల్లి మండల కేంద్రం

జూలపల్లి: గ్రామాల్లో నెలరోజులుగా ఎన్నికల వేడితో సందడిగా మారిన గ్రామాలు, ఎన్నికలు ముగియడంతో నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. నామినేషన్ల ప్రక్రియ ముగిసిన నాటి నుంచి గ్రామాల్లో గల్లీల్లో వాహనాలకు మైకులు పెట్టి హోరెత్తించిన పార్టీలు తమ గెలుపోటములపై అనుచరులతో అంచనాలు వేసుకునే పనిలో బిజీ అయ్యారు అభ్యర్థులు. సంక్షేమ పథకాలు తమను విజయతీరం చేర్చుతాయని అధికార పార్టీ నేతలు ప్రగాఢ విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఆరు గ్యారంటీలు ప్రజల మదిలో నాటుకుపోయాయని తమ విజయం ఖాయమైందని కాంగ్రెస్ నేతలు ధీమాగా ఉన్నారు. బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యమని విజయమే లక్ష్యంగా గ్రామగ్రామాన మహిళలతో ప్రచారం చేయించి బీఎస్పీని ప్రజల్లోకి తీసుకెళ్లారు నాయకులు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, గ్రామాల అభివృద్ధిలో కేంద్ర నిధులు భారీగా విడుదల చేస్తున్నాయని ప్రజలకు వివరించి తమ అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ నేతలు ప్రచారం చేశారు.

వ్యవసాయ పనుల్లో రైతన్న బిజీ బిజీ..

ప్రస్తుతం వరికోతలు, కొత్తగా వరినార్లు పోయడం, పత్తి ఏరడం లాంటి పనుల్లో రైతులు బిజీ అయ్యారు. ఇన్ని రోజులు ఎన్నికలు ముగిసిన తర్వాత పత్తి ఏరుదామని ఆగిన రైతులు వ్యవసాయ కూలీలను తీసుకెళ్లి పత్తి ఏరే పనిలో పడ్డారు.

కాలుష్య కోరల్లో సుల్తానాబాద్



సుల్తానాబాద్: సుల్తానాబాద్ పట్టణం కాలుష్యం కోరల్లో చిక్కుకుంటోంది. పూసాల, సుగ్లాంపల్లితోపాటు పలు గ్రామాల్లో వెలిసిన రైస్‌మిల్లులు, ఇతర పరిశ్రమల నుంచి కాలుష్యం వెలువడుతోంది. రైస్‌మిల్లుల నుంచి పొగ బయటకు రావొద్దన్న నిబంధనలు ఉన్నప్పటికీ యాజమాన్యం పాటించడం లేదని ఆరోపణలు ఉన్నాయి. కాలుష్యాన్ని నివారించి కాలుష్య రహిత పట్టణంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందని ప్రజలు అంటున్నారు.

రామగుండం పోలింగ్ వివరాలు

జ్యోతినగర్: రామగుండం అసెంబ్లీ ఎన్నికల నిర్వహణలో పోలింగ్ శాతం వివరాలను ఎన్నికల అధికారులు శుక్రవారం విడుదల చేశారు. అంతర్గాం, పాలకుర్తి, రామగుండం మండలాల్లో మొత్తంగా 2,21,019 మంది ఓటర్లకు 1,51,865 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారని వెల్లడించారు.

దుక్కులు ప్రారంభం



పెద్దాపూర్ వద్ద దుక్కి దున్నుతున్న రైతు

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో వరికోతలు పూర్తి కావస్తుండడంతో వరినార్లను పోసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. పెద్దాపూర్ పెద్ద చెరువు కింద మినహా మిగతా వరికోతలు పూర్తయ్యాయి. ప్రస్తుతం బావులు, బోర్లను ఆధారం చేసుకుని దుక్కులు సిద్ధం చేస్తున్నారు రైతులు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన



గోదావరిఖనిటౌన్: ర్యాలీగా బయలుదేరిన కళాశాల విద్యార్థులు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మాధవి



ముత్తారంలో ర్యాలీ నిర్వహణ

గోదావరిఖనిటౌన్: ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాధవి మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధికి చికిత్స లేదని, నివారణ ఒక్కటే మార్గమని పేర్కొన్నారు. నేటి యువతీ, యువకులు ఈ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ వ్యాధి సోకిన వారిని చిన్న చూపు చూడరాదని, వారిని సమాజంలోని వ్యక్తులుగానే గౌరవించాలని కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి జీడి కనుకయ్య, అధ్యాపకులు శ్రీధర్, కళా రాధ, రమాదేవి, ప్రియదర్శిని, స్వప్న, శ్రీగోదా, భాగ్యలక్ష్మి, అనూష పాల్గొన్నారు.


లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

గోదావరిఖనిటౌన్: ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవం సందర్భంగా నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఎన్ఎస్ఎస్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం కళాశాల నుంచి మున్సిపల్ ఆఫీస్ వరకు ర్యాలీని నిర్వహించారు. ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఖాజా జహీర్‌అహ్మద్, లయన్స్ క్లబ్ సభ్యులు డాక్టర్ లక్ష్మీవాణి, డాక్టర్ వనజ, సుబ్బారావు, శారద, డాక్టర్ కిరణ్మయి, ఉషారాణి పాల్గొన్నారు.

ముత్తారంలో..

ముత్తారం: ముత్తారంలో ప్రభుత్వ వైద్యుడు అమరేందర్‌రావు ఆధ్వర్యంలో ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఈ ర్యాలీని ప్రారంభించారు. అక్కడి నుంచి అడవిశ్రీరాంపూర్ చౌరస్తా మీదుగా ముత్తారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధివ్యాప్తి, దాని నివారణ చర్యలపై వైద్యుడు స్థానికులకు అవగాహన కల్పించారు. హెచ్ఈవో నరసింహారెడ్డి, సూపర్‌వైజర్ వీరేశం, అసిస్టెంట్ శ్రీనివాస్, ఫార్మసిస్టు జగదీశ్వర్, ల్యాబ్ టెక్నీషియన్ అనిల్, స్టాఫ్‌నర్స్ మంగ, కల్పన, సునీత, రమాదేవి, స్రవంతి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

వంతెనకు 'వంద'నం



గోదావరి నదిపై నిర్మించిన అతి పురాతనమైన రైల్వే వంతెన

- శతాధికం దాటినా.. చెక్కు చెదరని వారధి
- నిజాం పాలకుల హయాంలో వంతెన నిర్మాణం

రామగుండం: పెద్దపల్లి జిల్లా అంతర్గాం సమీపంలోని గోదావరి నదిపై నిర్మించిన వారధికి వందేళ్లు నిండాయి. నిజాం సర్కార్ హయాంలో గోదావరి నదిపై రెండు జిల్లాలకు వారధిగా 1921లో నిర్మించిన వంతెనతో ఉత్తర–దక్షిణ భారతదేశానికి రైల్వే కనెక్టివిటీ అయింది. ఆ సమయంలోనే సంపూర్ణ నాణ్యతతో సింగిల్ రైల్వేట్రాక్ నిర్మాణం చేపట్టాలి. కాగా భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని గుజరాత్‌కు చెందిన కాంట్రాక్టర్ కర్షన్‌లాల్ ఆనాటి ఇంజనీర్ల పర్యవేక్షణలో రైల్వే వంతెనపై రెండు రైల్వే లైన్లతో నిర్మించినట్లు రైల్వే అధికారులు పేర్కొంటున్నారు. ఆనాడు నిర్మించిన వంతెన ప్రస్తుతం పెరిగిన రైళ్ల రద్దీని తట్టుకుంటూ ప్రజావసరాలను తీరుస్తోంది. గోదావరి నదిపై 42 పిల్లర్లతో నిర్మించగా ఇందులో సగభాగం పెద్దపల్లి, సగం మంచిర్యాల జిల్లా పరిధిలోకి చేరాయి. కాగా ప్రతి ఏటా వర్షాకాలంలో గోదావరి ఉధృతంగా ప్రవహించినప్పటికీ వందేళ్ల కాలంలో ఏనాడూ వంతెనపై నుంచి వరద నీరు ప్రవహించిన దాఖలాలు లేకపోవడం గమనార్హం. కాగా ఇప్పటికే వంతెన కాలపరిమితి ముగిసినా పిల్లర్లు చెక్కు చెదరలేదు. కాగా వంతెనపై రైల్వేట్రాక్ మరమ్మతు చేపట్టేందుకు ఇరువైపులా ప్రత్యేకంగా రైల్వే సిబ్బంది నడిచేందుకు వీలుగా ప్రత్యేక ప్లాట్‌ఫారం నిర్మించారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయిన తర్వాత రెండు జిల్లాల్లో వ్యాపార, వాణిజ్యపరంగా సంబంధాలు ఎంతగానో అభివృద్ధి చెందాయి. కాగా 2018లో అదనంగా మూడో రైల్వే ట్రాక్ నిర్మాణం చేపట్టారు. తాజాగా అంతర్గాం–మంచిర్యాలకు గోదావరినదిపై రోడ్డు మార్గం వంతెన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. దీంతో రెండు జిల్లాల మధ్య రాబోయే కాలంలో దూరభారం తగ్గడంతో పాటు ఎన్నో రంగాల్లో అభివృద్ధి సాధించనుంది.

ఇరుకు రోడ్లతో ఇక్కట్లు.. ఇంకెన్నాళ్లు?



కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ ప్రధాన రహదారిలో ఇరుకు రోడ్లతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనునిత్యం సరుకుల రవాణాతో లారీలు, బస్సులు ప్రయాణిస్తుంటాయి. భారీ వాహనాలు లోడ్‌తో వస్తే పక్కకు వెళ్తే డ్రైనేజీలో పడే పరిస్థితి. ఆగితే ఎదురుగా మరో లారీ వెళ్లదు. ధాన్యం లోడ్, ఎరువుల లోడ్ ఎదురు పడితే బాడీ తాకి బస్తాలు చిరిగిపోయి బస్తాలో నుంచి నేలపై పడి నష్టాల పాలవుతున్నారు. దీంతో ట్రాఫిక్ జామ్ అవుతుంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు ఇరుకు రోడ్డును వెడల్పు చేసి ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.